DD9 వార్త
తెలుగు దినపత్రిక
www.dd9vaartha.com
సంపుటి : 01 సంచిక : 160 మంగళవారం, 27, 2026 , పేజీలు - 06 వెల : 3/-

**మంచిమాట**

మంచి మనుషులు వీధి దీపాల లాంటివారు. వారివల్ల నడిచే దూరం తగ్గదు కానీ దారి అంతా వెలుతురు పరుచుకుంటుంది. అందువల్ల తేలికగా గమ్యాన్ని చేరగలుగుతాం.

## తిరుపతి, శుభాన్షు శుక్లాకు అశోక చక్ర ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ, జనవరి 26:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని అడుగుపెట్టిన తొలి భారతీయుడు గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ అత్యున్నత శౌర్య పురస్కారం అశోక చక్రతో గౌరవించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో కెప్టెన్ శుభాన్షు శుక్లాకు ఆమె ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారుఅంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లేందుకు యాక్సి యమ్-4 మిషన్ చేపట్టిన సమయంలో గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అసాధారణ ధైర్యంతో పాటు ఆయన సంకల్పానికి గౌరవంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. 2025 జూన్?లో 'యాక్సియమ్-4' మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లా అడుగుపెట్టారు. దాదాపు 18 రోజుల పాటు ఆయన అక్కడే ఉండి అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన కీలక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టం, మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పని చేస్తుందనే అంశాలపై ఆయన వీడియో చిత్రీకరించారు. అలాగే అంతరిక్షంలో మానవ వ్యోమగాముల పరిస్థితిపై సైతం ఆయన అధ్యయనం చేశారు.



ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో మోడీ పరేడ్ వివరాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ కనిపించిన ప్రధాని



# ప్రత్యేక ఆకర్షణగా మోడీ తలపాగా

**న్యూఢిల్లీ,జనవరి 26 :**దేశంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా మిగతా2లో...

# తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో పెరిగిన ఇమేజ్

మూడు ఎకనమిక్ జోన్లుగా రాష్ట్ర విభజన

సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి

మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయింపు

26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ

ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందచేత

గణతంత్ర దినోత్సవంలో గవర్నర్ జిష్టుదేవ్ వర్మ



**హైదరాబాద్,జనవరి 26 :** భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగరవేశారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని.. ఈ డాక్యుమెంట్



హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మేడారం అభివృద్ధి కోసం రూ. 251 కోట్లు కేటాయించినట్లు గవర్నర్ వెల్లడిం చారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ మిగతా2లో...

# అంబరాన్నింటిన గణతంత్ర వేడుకులు

జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

ఆకట్టుకున్న సైనిక శకట ప్రదర్శన

ప్రత్యేక ఆకర్షణగా ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థలు

ముఖ్య అతిథులుగా ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్‌డెర్ లేయెన్



**న్యూఢిల్లీ,జనవరి 26 :** దేశ రాజధాని దిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం తొలిసారి ఈ పరేడ్‌లో పాల్గొంది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా ప్రదర్శనలిచ్చింది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్‌లో వాడిన ప్రధాన ఆయుధ వ్యవస్థలు వంటివి మిగతా2లో...

# అమరావతిలో వేడుకలు అభినందనీయం

రాజ్యాంగస్ఫూర్తితో ఏపిలో అభివృద్ధి

డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి,జనవరి 26 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. పవన్ మాట్లాడుతూ.. 'అమరావతిలో తొలిసారి గణతంత్ర మిగతా2లో...

# రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర

అదేబాటలో కాంగ్రెస్ పాలకులు: బిజెపి కార్యాలయంలో జెండా ఎగరేసిన రామ్



**హైదరాబాద్,జనవరి 26:** రాజ్యాంగంలో కల్పించిన మౌలిక హక్కులను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కాలరాశారని.. ఇందిరా, రాజీవ్ గాంధీల బాటలోనే రాహుల్ గాంధీ నడుస్తున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. భారతీయులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని... ఇతర దేశాలకు చెందిన వారికి ఓటు హక్కు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చాలా మంది రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేశారని... నెహ్రూ రాజ్యాంగాన్ని పక్కకు పెట్టారని విమర్శించారు. మొదటిసారి రాజ్యాంగాన్ని అవమానించింది నెహ్రూ అని... అంబేద్కర్‌ను అవమానించారని ఆరోపించారు. అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు.సీఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ఉపాధి పథకంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పేదలకు మేలు చేయాలన్నదే ప్రధాని మిగతా2లో...




# మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హుస్నాబాద్‌లో జెండా ఊపి ప్రారంభించిన మంత్రి పొన్నాం

# స్వాతంత్ర ఉద్యమ చరిత్ర లేని బిజెపి




# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

● బిఆర్ఎస్‌లో చేరిన పలువురు చేవెళ్ల నేతలు:

కార్యకర్తలకు కెటిఆర్ పిలుపు




**హైదరాబాద్,జనవరి 26 :** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధృతరాష్ట్రపాత పోషిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహాభారతంలో ధృతరాష్ట్రుడికి ఏమీ కనిపించనట్లు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సభాపతి అలానే వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్ లో కేటీఆర్ సమక్షంలో చేవెళ్ల నియోజక వర్గం లోని పలువురు బీజేపీ నేతలు.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేటీఆర్. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండోసారి మోసపోతే.. మనం తప్పు చేసిన వాళ్లమవుతామని చెప్పారు. ఈసారి కేసీఆర్ సీఎం అయితే తెలంగాణలో మిగిలిన సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాలె యాదయ్యను తన మనిషి అనుకుని కేసీఆర్ అసెంబ్లీ మిగతా2లో...

# తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో పెరిగిన ఇమేజ్

(మొదటి పేజీ తరువాయి)

వేడుకలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన తెలిపారు. ఐటిఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని, మహిళలను పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అ÷-దదె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. 27 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని గవర్నర్ తెలిపారు. తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చా రు. ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇ ళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరా బాద్‌లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుం టున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. అమెరికా పర్యటనలో ఉండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరు కాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఈ రోజును భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు.

# రాజ్యాంగాన్ని కాలరాసిన ఇందిర

(మొదటి పేజీ తరువాయి)

మోదీ లక్ష్యమని తెలంగాణ బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్లపాటు దేశాన్ని దోచుకుందని.. పేదలకు మేలు చేసే పథకాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని రాష్ట్ర బీజేపీ చీఫ్ విమర్శించారు. రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అంబేద్కర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇవ్వలేదని గుర్తుచేశారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవిం చింది మోదీ ప్రభుత్వమని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రైతులకు ఏమీ చేయలేదని, ప్రధాని కిసాన్ యోజన ద్వారా రైతులకు మోదీ మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. మజ్లిస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి పార్టీలంటూ వ్యాఖ్యలు చేశారు. రెండు పార్టీలను తరిమికొట్టి బీజేపీని ఆదరించాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఎంపీ లక్ష్మణ్ సహా పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన గణతంత్ర వేడుకులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకలను వీక్షించేం దుకు వేలాది మంది విచ్చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించిన పరేడ్ భారత సైనిక శక్తి పాటవాన్ని సగర్వంగా చాటిచెప్పింది. ఆపరేషన్ సిందూర్‌లో వాడిన పలు ఆయుధ వ్యవస్థలను సైనిక దళాలు కర్తవ్యపథ్ వేదికగా అచ్చెరువొందేలా ప్రదర్శించాయి. ఈ కవాతులో తొలిసారిగా బ్యాటిల్ అరే ఫార్మేషన్‌లో నిర్వహించిన కవాతు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యుద్ధ క్షేత్రంలో సైన్యాల మోహరింపును పోలినట్టు పరేడ్ నిర్వహించడం అతిథులు ఆశ్చర్యపోయేలా చేసింది. ఈ పరేడ్‌లో త్రివిధ దళాలకు చెందిన 6,050 సైనికులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో సాగిన ఆయుధ ప్రదర్శన భారత సైనిక పాటవాన్ని జగద్విదితం చేసింది. ఈ వేడుకల సందర్భంగా నాలుగు ఎమ్ఐ-17 హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకగా నిలిచిన ఆకాశ్ ఆయుధ వ్యవస్థ, బ్రహ్మోస్ క్షిపణి ప్రదర్శన, 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలిగే సూర్యాస్త్ర రాకెట్ లాంఛర్ అతిథులను ఆకట్టుకున్నాయి. అర్జున్ యుద్ధ ట్యాంకు ప్రదర్శన కూడా ప్రత్యేక అట్రాక్షన్‌గా నిలిచింది. భారత్‌కు అత్యంత కీలకంగా మారిన ఎస్-400 క్షిపణి నిరోధక వ్యవస్థను కూడా ప్రదర్శించారు. అపాచీ, ప్రచండ్ హెలికాప్టర్లు, వివిధ యుద్ధ విమానాల గగనతల విన్యాసాలు మెప్పించాయి. డ్రోన్ ప్రదర్శన కూడా పరేడ్‌లో జనాలను అమితంగా ఆకట్టుకుంది. ఈ కవాతులో కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్ కూడా మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సైనిక కవాతుతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు, కళా ప్రదర్శనలు దేశ సాంస్కృతిక వైవిధ్యతను చాటాయి. కేంద్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన 30 శకటాలు దేశ ఖ్యాతిని ఇనుడింపచేశాయి. ఈ వేడుకల్లో దేశం నలుమూలల నుంచి సుమారు 10 వేల మంది అతిథులు పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు.

# స్వాతంత్ర ఉద్యమ చరిత్ర లేని బిజెపి

**ఉపాధిలో గాంధీ పేరును తొలగించారు**

**ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన ఘనత**

**గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణలో పిసిసి చీఫ్**

**హైదరాబాద్,జనవరి 26 :** స్వాతంత్య ఉద్యమంలో పాల్గొనని పెద్దలు 2014 నుంచి అధికారంలోకి వచ్చారని, వారు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనం గా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ పేరును తొలగించాలని మన్రేగా పథకాన్ని రద్దు చేస్తున్నారని.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చిత్రాలు కనిపిస్తాయని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. 2014 వరకు యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని, లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని, కులాలు- మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మహేష్ గౌడ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఆర్థిక విధ్వంసం జరిగిందని... సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కుల సర్వేతో యావత్ రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని తెలిపారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కులగణన బిల్లులను బీజేపీ అడ్డుకుంటోందని, బీజేపీ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని టీపీసీసీ చీఫ్ కోరారు. మహాత్ముడి ఆధ్వర్యంలో స్వాతంత్య్ర పోరాటం విజయవంత మైందని, ప్రపంచం గర్వించదగ్గ రాజ్యాంగాన్ని అంబేద్కర్ రాశారన్నారు. మహాత్మా గాంధీ కలలు నెరవేర్చే దూరదృష్టి ఉన్న వ్యక్తి నెహ్రూ అని ప్రశంసించారు. ఐరన్ లేడీ ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ దేశానికి గట్టి పునాదులు వేశారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డాక్టర్ అజారుద్దీన్, షబ్బీర్ అలీ సహా వీహెచ్, దానం నాగేందర్, సంపత్, కోదండరాం, బెల్లయ్య, చిన్నారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ జివో సవరణ..
# సవరణ జీవో నెంబర్ 103 జారీ



**హైదరాబాద్,జనవరి 26 :** ప్రభుత్వం జారీచేసిన అక్రిడిటేషన్ల జీవోపై జర్నలిస్టుల నుంచి ఆందోళన వ్యక్తం కావడంతో ప్రభుత్వం దిద్దుబాటుకు పూనుకుంది. డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రిడిటేషన్ కార్డులే జారీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ జీవో నెంబర్ 103 పై తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం హర్షం వ్యక్తం చేసింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ గతంలో తీసుకువచ్చిన 252 జీవో పై టీయూడబ్ల్యూజే చేసిన పోరాట ఫలితంగా జర్నలిస్టు సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసిందన్నారు. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవరణ జీవో తేవడం, అందులో ప్రధానంగా అందరి జర్నలిస్టుల మాదిరిగానే డెస్క్ జర్నలిస్ట్ సైతం అక్రిడిటేషన్ కార్డులే జారీచేస్తామని చేస్తున్నారని స్పష్టం చేయడం ముదావహం అన్నారు. మండల స్థాయిలో లక్షన్నరకు పైగా జనాభా ఉన్నచోట అదనపు కార్డులు ఇస్తామని పేర్కొనడంతోపాటు కల్చరల్, స్పోర్ట్స్, సినిమా జర్నలిస్టులకు సైతం ప్రత్యేకంగా కార్డులు జారీ చేస్తానని ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జీవో మారడం టీయూడబ్ల్యూజే సాధించిన విజయమని పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో వచ్చిన 239 జీవో ప్రకారం వచ్చినన్ని అక్రిడేషన్ కార్డులు ఈ సవరణ జీవో అనంతరం కూడా ఆ స్థాయిలో రావడంలేదని విషయం తేటతెల్లమైందన్నారు.

# ప్రత్యేక ఆకర్శణగా మోడీ తలపాగా

(మొదటి పేజీ తరువాయి)

వాన్‌డెర్ లేయెన్ భారతీయత ఉట్టిపడేలా డ్రెస్ ధరించారు. అయితే మరో అరుదైన దృశ్యం ఆవిష్కృతమయ్యింది. ఉర్సులాకు ప్రధాని మోదీ పరేడు వివరాలను ఎప్పటికప్పుడు వివరించారు. మోడీ వివరాలను ఆమె ఆసక్తిగా విన్నారు. ఇకపోతే ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఉదా, ఆకుపచ్చ రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో నేసిన బంగారు రంగు మోటిఫ్‌లతో అది ఆకర్షణీయంగా కనిపించింది. ఈ రాజస్థానీ సంప్రదాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. అందులోని ఎరుపు.. అభిరుచి, ఉత్సుకత, ధైర్యసాహసాలకు నిదర్శనంగా చెప్తారు. అలాగే ముదురునీలం, తెలుపు రంగుల్లో ఉన్న కుర్తా పైజామా ధరించారు. పైన లేత నీలంలో ఉన్న జాకెట్ వేసుకున్నారు. మరోవైపు ఉర్సులా.. మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రెస్ ధరించారు. ఈ వస్త్రధారణతో ఈ వేడుక కు తగ్గట్టుగా ఆమెలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడింది. ఆమె సాధారణంగా ధరించే ప్యాంట్‌సూట్స్‌కు భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు. ఐరోపా సమాఖ్యకు ఉర్సులా తొలి మహిళా అధ్యక్షురాలు. 2019లో తొలిసారి బాధ్యతలు చేపట్టిన ఆమె.. 2024లో రెండోసారి ఎన్నికయ్యారు. 2029 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. అంతకుముందు ఆమె 2005 నుంచి 2019 వరకు జర్మనీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. మరోవైపు, భారత్-ఐరోపా యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ పర్యటనలో ఆ ఒప్పందం జరిగే అవకాశం ఉంది.

# అమరావతిలో వేడుకలు అభినందనీయం

(మొదటి పేజీ తరువాయి)

వేడుకలు అద్భుతంగా జరిగాయి. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధి జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ఆనందాన్నిచ్చింది. ఈ కార్యక్రమం భవిష్యత్తు లక్ష్యాలకు అద్దంపట్టింది. నేలపాడు ప్రాంతంలోని పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకలో పాల్గొన్న 22 శకటాలు రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించాయి' అని పేర్కొన్నారు. పవన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'సీఎం చంద్రబాబు నాయకత్వంలో అమరావతి నగరం సకల సౌకర్యాలతో విశ్వనగరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను. గణతంత్ర దినోత్సవ వేదిక నుంచి గౌరవ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుకు మార్గనిర్దేశర చేసింది. భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్తామని తెలియజేస్తున్నా. రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి 77వ గణతంత్ర దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేస్తున్నాను. కూటమి ప్రభుత్వం వేసే ప్రతి అడుగు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా.. రాష్ట్రాభివృద్దే ధ్యేయంగా ఉంటుందని మాటిస్తున్నాము' అని పవన్ అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో గెలిపించారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గెలిపించిన కొన్ని రోజులకే.. ఆయన కాంగ్రెస్ గూటికి వెళ్లాడంటూ మండిపడ్డారు. యాదయ్య పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని.. ఆయనపై వేటు వేయాలని స్పీకర్‌ను కోరామన్నారు. కానీ యాదయ్య.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని స్పీకర్ అంటున్నారని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, యాదయ్యలు చిన్ననాటి నుంచీ దోస్తులని.. వీరిద్దరూ ఒకే బండిపై తిరిగేవారని కేటీఆర్ చెప్పుకొచ్చారు.చేవెళ్లలో ఐదేళ్ల అబ్బాయిని అడిగినా.. కాలె యాదయ్య పార్టీ మారాడనే చెబుతారన్నారు. కానీ స్పీకర్ మాత్రం ఆయన బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని చెబుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు.. తాము పార్టీ మారామని చెప్పే దమ్ములేదని కేటీఆర్ అన్నారు.ఎన్నికల ప్రచార సమయంలో చేవెళ్లలో దళితులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చాలా హామీలు ఇచ్చారని చెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. ప్రతీ దళిత కుటుంబానికి రూ.12 లక్షలు కాదు కదా.. కనీసం 12 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. వృద్ధులకు పింఛన్లు పెంచుతామని చెప్పి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందరినీ కడుపులో పెట్టుకుని చూసేవారని వివరించారు. నాట్లు వేసే సమయంలో టింగ్ టింగ్‌మంటూ రైతుల అకౌంట్‌లలో రైతుబంధు పడేదంటూ ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే.. తమపై కేసులు పెట్టి బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. బూతులు తమకూ వచ్చున్న ఆయన.. మాట్లాడేందుకు సంస్కారం అడ్డొస్తోందన్నారు. ప్రజల దయతో తామంతా మంత్రులమయ్యామని కేటీఆర్ చెప్పారు.

# మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**సిద్దిపేట,జనవరి 26 :** తెలంగాణ కుంభమేళాగా పిలవబడే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్ స్టేషన్‌లో మేడారం స్పెషల్ బస్సులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకుంటున్న పలు కీలక నిర్ణయాలను ఆయన వెల్లడించారు. జాతరకు వెళ్లే భక్తులకు ఎక్కడా రవాణా ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4000 ఆర్టీసీ బస్సులను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఒక్క హుస్నాబాద్ డిపో నుండే మేడారానికి 50 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని, ఎవరూ ఇబ్బంది పడకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని మంత్రి సూచించారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం అత్యంత సురక్షితమైనదని, ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ బస్సులకు ఒక ప్రత్యేక సౌకర్యం ఉందని మంత్రి వివరించారు. భక్తులు నడక సాగించే అవసరం లేకుండా, నేరుగా అమ్మవార్ల గద్దెల వరకు వెళ్లగలిగే రవాణా సౌకర్యం కేవలం ప్రభుత్వ బస్సులకే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ వాహనాలలో రద్దీ , ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ప్రజలు ఆర్టీసీని ఎంచుకోవాలని కోరారు. జాతరలో లక్షలాది మంది భక్తులు పాల్గొనే క్రమంలో చిన్న పిల్లలు తప్పిపోయే ప్రమాదం ఉంటుంది. దీనిని నివారించేందుకు పోలీస్ శాఖ , ఆర్టీసీ సంయుక్తంగా ఒక వినూత్న చర్య చేపట్టాయి. జాతరకు వచ్చే ప్రతి చిన్న బిడ్డ చేతికి పేరు , తల్లిదండ్రుల ఫోన్ నంబర్ నమోదు చేసిన ఒక ప్రత్యేక బ్యాండ్‌ను కడతారు. ఒకవేళ రద్దీలో పిల్లలు తప్పిపోయినా, ఈ బ్యాండ్ ఆధారంగా వారిని వెంటనే తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి వీలవుతుంది. ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు. హుస్నాబాద్ నుండి ప్రారంభమైన ఈ బస్సు సర్వీసులు జాతర ముగిసే వరకు నిరంతరాయంగా అందుబాటులో ఉంటాయని, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో పరిణామం

- **బిఆర్ఎస్ మాజీ ఎంపి సంతోష్‌కు సిట్ నోటీసులు**

**హైదరాబాద్,జనవరి 26 :** సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు తాజాగా బీఆర్ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావుకు నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా, ఈ వ్యవహారానికి సంబంధించిన కొన్ని కీలక వాస్తవాలు సంతోష్ రావుకు తెలిసి ఉండవచ్చని భావిస్తున్నట్లు పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, విచారణ నిమిత్తం జనవరి 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జుబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో స్వయంగా హాజరు కావాలని జుబ్లీహిల్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటగిరి ఆదేశించారు. ఇప్పటికే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులను విచారించిన సంగతి తెలిసిందే. ఐటీ చట్టం, ప్రభుత్వ ఆస్తుల నష్టం నిరోధక చట్టం వంటి కఠిన సెక్షన్ల కింద కొనసాగుతున్న ఈ విచారణలో సంతోష్ రావుకు నోటీసులు అందడం రాజకీయ వర్గాల్లో పెను కలకలం రేపుతోంది. రేపు మధ్యాహ్నం జరగబోయే ఈ విచారణలో సిట్ అధికారులు సంతోష్ రావు నుండి ఎటువంటి సమాచారాన్ని రాబడతారనే అంశంపై ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

## జిల్లా కలెక్టర్,ఎస్ పి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న బజార్ హత్నూర్ స్టేషన్ ఫ్రెండ్లీ పోలీస్.



**బజార్ హత్నూర్, జనవరి, 26(డిడి9వార్త న్యూస్):-** విధి నిర్వహణ లో అంకిత భావం తో మెలుగుతూ ఫ్రెండ్లీ పోలీస్ తో బజార్ హత్నూర్ ప్రజల , యువకులమన్నలను పొందుతున్న శ్రీదర్ రెడ్డి ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా,ఎస్ పి అఖిల్, మహాజన్ల చేతులమీదుగా ప్రశంసలుఅందుకొన్నారు.సోమవారం రోజు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీలు 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ప్రశంసా పత్రం ఇచ్చి,అభినందనలు తెలిపారు.బజార్హత్నూర్ మండలశీ లోని పలువురు ప్రజలు కూడా శ్రీధర్ రెడ్డి ని అభినందిస్తూ శుభాకాంక్షలు చెప్పారు.

## శాఖ గ్రంథాలయంలో వెలవెలబోయిన గణతంత్ర వేడుకలు

**- జాతీయ పతాకావిష్కరణకు నోచుకోని వైనం**

**- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పాఠకులు, స్థానికులు**




**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** దేశవ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అంబరాన్నంటుతుంటే, సాలూర మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటైన జిల్లా శాఖ గ్రంథాలయం మాత్రం వెలవెలబోయింది. ఆరు నెలల క్రితం ఎంతో హడావుడిగా ప్రారంభించిన ఈ గ్రంథాలయంలో కనీసం జాతీయ పతాకావిష్కరణ కూడా నిర్వహించకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు దేశభక్తి గీతాలతో మారుమోగుతుంటే, జ్ఞానాన్ని పంచే దేవాలయంగా పిలవబడే గ్రంథాలయం వద్ద మాత్రం నిశ్శబ్దం రాజ్యమేలడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ప్రభుత్వ సంస్థలో జాతీయ పండుగలను ఘనంగా నిర్వహించాల్సి ఉండగా, ఈ గ్రంథాలయం వైపు కన్నెత్తి చూసిన నాథుడే కరువయ్యారు. కొత్తగా ఏర్పాటైన శాఖ కాబట్టి ఈసారి వేడుకలు మరింత ఉత్సాహంగా జరుగుతాయని ఆశించిన పాఠకులకు నిరాశే ఎదురైంది. కనీసం జెండా కట్టడానికి కూడా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. అధికారులు తమ సొంత పనుల్లో నిమగ్నమై, రాజ్యాంగ స్ఫూర్తిని చాటిచెప్పే ఈ కీలక పండుగను విస్మరించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే ప్రభుత్వ వ్యవస్థలు నడుస్తున్నాయని, అటువంటి రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజున పతాకావిష్కరణ చేయకపోవడం అగౌరవపరచడమేనని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పాఠకులు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

## పనికి వెళ్లిన అడ్డా కూలీ మృతి : ఆచూకీ కోసం పోలీసుల ఆరా



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తుతెలియని అడ్డా కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూర మండలం సాలంపాడ్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, నాని అనే పేరు గల కూలీని పని కోసం తీసుకెళ్లాడు. పని పూర్తయిన తర్వాత సదరు కూలీ అకస్మాత్తుగా అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ కూలీ ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి పూర్తి వివరాలు తెలిసిన వారు కానీ, బంధువులు కానీ ఉంటే బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ లేదా 87126 59872 నంబరులో సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఉత్తమ కళాకారుడికి ప్రశంసా పత్రం అందజేత



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులకు, కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. బోధన్ పట్టణం రాకాస్?పేటకు చెందిన సమీర్ ఉత్తమ కళాకారుడిగా సబ్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విట్టల్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు సర్కారు దుస్తుల పంపిణీ

థ



**నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** మోపాల్ మండలంలోని శ్రీరామ్ నగర్ తండాలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంగన్?వాడీ విద్యార్థులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తరహాలోనే అంగన్?వాడీ చిన్నారులకు సైతం ప్రభుత్వం దుస్తులు అందించాలని నిర్ణయించడంతో స్థానిక మహిళా సంఘాల ద్వారా వీటిని సిద్ధం చేయించి పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్?వాడీ కార్యకర్త మాట్లాడుతూ.. చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు మరియు అంగన్?వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఈ చొరవ తీసుకుందని తెలిపారు. సర్పంచ్ సరోజ, ఉప సర్పంచ్ ప్రకాశ్ మాట్లాడుతూ అంగన్?వాడీ స్థాయి నుంచే నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, కారోబార్ తదితరులు పాల్గొన్నారు.

# బజార్ హత్నూర్ మండలంలో 77 వ గణతంత్ర వేడుకలు









**బజార్ హత్నూర్, జనవరి, 26(డిడి9వార్త న్యూస్ ):-** బజార్ హత్నూర్ మండలంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగాసోమవారం రోజు వివిధగ్రామాలలోను,మండల కేంద్రంలో 77 వ రాజ్యాంగ దినోత్సవంను జరిపారు.ఈ ంగా ప్రభుత్వకార్యాలయంలలోఆకార్యాలయంలఅధికారులు,పాఠశాల లో ఉపాధ్యాయులు త్రివర్ణ జెండాలు ఆవిష్కరణ చేశారు. తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ శ్యామ్ సుందర్ జాతీయ జెండా ఆవిష్కరణ చేయగా, పోలీస్ అధికారులు వందన సమర్పణ చేశారు. ఎంపీడీఓకార్యాలయంలోఎంపీడీఓ శ్రీనివాస్, కళాశాలలోకె. సునీల్ కుమార్, వెలుగు కా ర్యాలయంలో ఏ పి ఓ, పోలీస్ స్టేషన్లో ఎస్ ఐ సంజయ్ కుమార్, పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు,విద్యా సంస్థ లలో జెండాలు ఆవిష్కరణ లు చేశారు. ఆయా విద్యా సంస్థ లలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు పలువురిని కన్నులవిందుచేశారు.ఉన్నత పాఠశాలలో నెల మీద వేసిన రంగ వల్లీలు, భారత దేశ చిత్ర పఠం వేడుకకు వచ్చిన పెద్దలను మంత్ర ముగ్దల్ని చేసింది. ఈ రోజు ఉదయం పూటనేపాఠశాలబాలబాలికలతో ప్రభాత బేరి మోగించారు. జాతీయ నినాదంలు చేస్తూ పుర వీదులలో ఊరేగింపుగా వెళుతున్న ప్రధాన కేంద్రాల వద్దఏర్పాటు చేసిన గణతంత్ర వేడుకకు హాజరు అయి మొదటి నోబెల్ బహుమతి గ్రహీత ఐన రవీంద్ర నాథ్ ఠాగూర్ రచించిన 'జనగణ మన అదినాయక జయ హై '! అనే జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ మేరకు పాఠశాలల విద్యార్థులకుబహుమతులుఇచ్చారు.ఈ కార్యక్రమంకు వచ్చిన ఆయా గ్రామ పెద్దలకు తీయనిపదార్థాలు(లడ్డుబొంది,కార)పంచి పెట్టి గణతంత్ర వేడుకశుభాకాంక్షలుతెలిపారు. ప్రభుత్వ,ప్రయివేటుపాఠశాలల్లో సంస్కృతి కార్యక్రమంలు, ఆటల,పాటల,పోటీలు,వ్యాస రచన పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనబర్చిన విజేతలకుకానుకలు ఇచ్చారు.

# సాలూరలో మిన్నంటిన గణతంత్ర వేడుకలు

**- ఘనంగా పతాకావిష్కరణలు.. దేశభక్తి చాటిన ప్రజలు**



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సాలూర మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దేశ సార్వభౌమత్వాన్ని చాటిచెప్పేలా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు మరియు ప్రజా సంఘాల కార్యాలయాల్లో జాతీయ పతాకాలు రెపరెపలాడాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులను స్మరిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కార్యాలయాల్లో పతాకావిష్కరణలు పండుగలా జరిగాయి. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ లావణ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహశీల్ కార్యాలయంలో తహశీల్దార్ శశి భూషణ్ జెండా ఎగురవేసి వందనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు క్షేత్రస్థాయిలో ఉన్న సామాన్యులకు అందినప్పుడే గణతంత్ర వేడుకలకు నిజమైన అర్థం లభిస్తుందన్నారు. వ్యవసాయ రంగ ప్రాముఖ్యతను చాటుతూ రైతు వేదిక ఆవరణలో వ్యవసాయ అధికారి శ్వేత, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆవరణలో సంజీవ్ కుమార్ పతాకావిష్కరణ చేశారు. అన్నదాతల శ్రమను గౌరవిస్తూ రాజ్యాంగబద్ధమైన సౌకర్యాలు అందరికీ అందాలని వారు ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎంఈవో రాజీ మంజూష జెండా ఎగురవేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వైద్యాధికారి రాజ్ కుమార్ వేడుకలు నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న మహాత్మా గాంధీ, అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు, బసవేశ్వర విగ్రహాలకు వివిధ సంఘాల నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఆటో యూనియన్ కార్మికులు కూడా స్వచ్ఛందంగా పాల్గొని ఆటో స్టాండ్ వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మండల స్థాయి అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీజీ జూనియర్ అధ్యాపకుల సంఘం క్యాలెండర్--2026 ఆవిష్కరణ.



**ఆదిలాబాద్, జనవరి, 26(డిడి9వార్త న్యూస్):-** తెలంగాణ గెజిటెడ్ జూనియర్ అధ్యాపకులసంఘం(టీజీజెఎల్ఏ 475) ఆదిలాబాద్ జిల్లా అధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్--2026ను ఆదిలాబాద్ జిల్లా మాధ్యమికవిద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ సోమవారం రోజు గణతంత్ర దినోత్సవం వేడుకల అనంతరం ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో తాశీసి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, గుడిహత్నూర్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్,ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆదిలాబాద్ (బాలికలు) ఇంచార్జి ప్రిన్సిపాల్ సూరజ్ సింగ్,ఆదిలాబాద్ జిల్లా పర్యవేక్షకులు మోసిన్ లు తదితరులు పాల్గొన్నారు.వచ్చే పరీక్షలనాటికీ విద్యార్థుల ను సంసిద్దులుగా చేయాలి:-

ఈ సందర్భంగా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ మాట్లాడారు. అధ్యాపకుల సేవలు సమాజంలో కీలకమైన మార్పులకు దోహదపడతాయని,విద్యార్థులభవిష్యత్తును తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సంసిద్దులుగా తయారు చేయాలని అధ్యాపకులకు సూచనలు ఇస్తూ కోరారు. ౦+జీూా 475 ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు చట్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని, రాబోయే వార్షిక పరీక్షలకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తూ విద్యార్థుల ఉన్నతికి తోడ్పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చొక్కాల రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాల్ల ఉపేందర్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు పిన్నంవార్ ప్రవీణ్, ఉపాధ్యక్షులు రవికాంత్ తిరుపతిరెడ్డి, జిల్లా ముఖ్య నాయకులు సుధాకర్ రావు, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల లో గణతంత్ర దినోత్సవ వేడుకలు.






**బజార్ హత్నూర్, జనవరి, 26(డిడి9వార్త న్యూస్):-** బజార్ హత్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రోజు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపల్ కే. సునీల్ కుమార్, ముఖ్య అతిథి అయిన బీసీ హాస్టల్ సంక్షేమ అధికారి ఫర్వేజ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జ్ఞానేశ్వర్ షిండే,బోధన, బోధనేతర సిబ్బంది,కళాశాల విద్యార్థిని విద్యార్థులు సామూహిక జాతీయ గీతం పాడుతూ పతాకావిష్కరణ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులనుపంపిణి చేశారు. ఈ మేరకు కళాశాల ప్రధాన అధ్యాపకులు కె సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, పరీక్షలలో ప్రతిభను చాటాలనిఅన్నారు. విద్యార్థులు రాజ్యాంగం హక్కులను, బాధ్యతలను తప్పకుండా పాటించాలని తెలియజేశారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షిండే జ్ఞానేశ్వర్ ,మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక బాధ్యతగా సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,బోధనేతర ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల్లో మహిళలకు 33% తప్పనిసరి!







**హైదరాబాద్:జనవరి 26,(డిడి9వార్త న్యూస్):-** తెలంగాణ ప్రభుత్వం మీడియా అక్రిడిటేషన్ 2026 నిబంధనాల్లోపలు కీలక సవరణలు చేస్తూ ఇవాళ తాజాగా జీవో నెం.103ను విడుదల చేసింది. ఈ సవరణల ద్వారా అక్రిడిటేషన్ల కేటాయింపులో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు మరికొన్ని నిబంధనలల్లో ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇక మీడియా యాజమాన్యాలు డెస్క్ జర్నలిస్టుల విభాగంలో కనీసం 33% శాతం మహిళలకు అవకాశం కల్పించడాన్ని తప్పనిసరి చేసింది. అక్రిడిటేషన్ కోటాలో కూడా మహిళా జర్నలిస్టులకు ఫస్ట్ ప్రియారిటీ ఇవ్వాలని స్పష్టం చేసింది. 2.5 లక్షల కంటే ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు, 1.50 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న మండలాల్లో అదనంగా ఒక అక్రిడిటేషన్ కార్డు కేటాయించనున్నారు. 2.5 లక్షల సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు స్పోర్ట్స్, కల్చర్, ఫిలిం విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ఒక్కో అదనపు అక్రిడిటేషన్ కార్డును సర్కార్ మంజూరు చేసింది. అదేవిధంగా 75 వేల నుంచి 2.5 లక్షల లోపు సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు స్పోర్ట్స్, కల్చర్, ఫిలిం విభాగాల్లో ఏదో ఒకదానిలో రాష్ట్ర స్థాయిలో ఒక అదనపు కార్డును ఇవ్వనున్నారు. అలాగే ఉర్దూ బిగ్ న్యూస్ పేపర్ అనే పదాన్ని ఉర్దూ డైలీ న్యూస్ పేపర్ గా మార్చింది,రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధితో పాటు పెద్ద దినపత్రికల నుంచి ఒక డెస్క్ జర్నలిస్ట్ ప్రతినిధిని కొత్తగా ఇద్దరు సభ్యులకు చోటు కల్పించనున్నారు. ఇకపై అక్రిడిటేషన్ నిబంధనల్లో ఎక్కడ 'మీడియా కార్డు' అని ఉన్నా దానిని 'అక్రిడిటేషన్ కార్డు'గానే పరిగణించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ సవరణలపై జర్నలిస్టు సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి దేశాయ్



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నివాసం సోమవారం రాజకీయ కోలాహలానికి వేదికైంది. బిఆర్?ఎస్?కు చెందిన సీనియర్ నేత వెంకటేశ్వర్ దేశాయ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్?లో చేరారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్వయంగా కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశాయ్ వంటి సీనియర్ నాయకుడు పార్టీలోకి రావడం కాంగ్రెస్?కు అదనపు బలాన్ని ఇస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, అరికెల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలో జిల్లా యంత్రాంగం అభివృద్ధి పథంలో నిజామాబాద్

**- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** జిల్లా ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, సంక్షేమ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరవేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాయుధ దళాల వందనాన్ని స్వీకరించి, జిల్లా అభివృద్ధి నివేదికను ప్రజల ముందుంచారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ రైతాంగాన్ని ఆదుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. నాలుగు విడతల్లో లక్ష మంది రైతులకు సంబంధించి రూ. 782.31 కోట్ల రుణాలను మాఫీ చేశామని ప్రకటించారు. రైతు భరోసా పథకం ద్వారా 2.72 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 316.63 కోట్లు జమ చేశామన్నారు. వివిధ కారణాలతో మరణించిన 308 మంది రైతు కుటుంబాలకు రూ. 15.40 కోట్ల పరిహారం అందించామని చెప్పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నిజం చేసేలా రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 19,397 ఇళ్ల లక్ష్యం కాగా, ఇప్పటికే 16,919 ఇళ్లు మంజూరు చేశామని, నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. లబ్ధిదారులకు ఇప్పటి వరకు రూ. 266.94 కోట్లు చెల్లించామన్నారు. ఉపాధి హామీ పథకంలో 1,17,886 మంది కూలీలకు 16.08 లక్షల పనిదినాలు కల్పించామని, కూలీల ఖాతాల్లో రూ. 61.65 కోట్లు జమ చేశామని తెలిపారు. 12,700 స్వయం సహాయక సంఘాలకు రూ. 1,109 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందజేశామన్నారు. వడ్డీ రాయితీ కింద రూ. 44.95 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. 674 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ. 24.01 కోట్లు వెచ్చించామని, జిల్లావ్యాప్తంగా 96,374 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. మాధవనగర్, అర్సపల్లి ఆర్వోబీ పనులకు రూ. 230 కోట్లు కేటాయించామని, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 560 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. భూ పరిపాలనలో సంస్కరణల కోసం 'భూ భారతి చట్టం – 2025'ను అమలు చేస్తున్నామని, శాంతిభద్రతల పరిరక్షణలో షీ టీమ్స్, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పటిష్టం చేస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి పునరుద్ఘాటించారు.

# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



**నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** కమ్మర్?పల్లి మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ కార్యాలయం వద్ద 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు లుక్క గంగాధర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన వారికి పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం పాలనా వ్యవస్థ కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో అద్భుతమైన రాజ్యాంగం రూపొందించబడిందని గుర్తుచేశారు. 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజే గణతంత్ర దినోత్సవమని, ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన మహనీయుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని, మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుదాం : జిల్లా సీపీ పి.సాయి చైతన్య





**నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** దేశ సౌభాగ్యానికి మూలస్తంభమైన రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కాపాడాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపునిచ్చారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అయన జాతీయ పతాకాన్ని ఎగురవేసి, పోలీసు బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఎ.ఆర్ హెడ్ క్వార్టర్స్ నందు అదనపు డీసీపీ (అడ్మిన్) శ్రీ జి. బస్వారెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. జోన్–2 డి.ఐ.జి క్యాంప్ కార్యాలయంలో నిజామాబాద్ ఏసీపీ శ్రీ రాజా వెంకట్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బందితో పాటు పాఠశాల విద్యార్థులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంపొందించేలా నోట్?బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం అందరికీ మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వంజరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పతాకావిష్కరణ



**నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగరలోని వంజరి సంఘం ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు గంగోనే గంగాధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో, నగర కమిటీ సంయుక్త కార్యదర్శి కరిపే గంగా శేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుంటూనే, బాధ్యతగల పౌరులుగా దేశాభివృద్ధిలో వంజరి సంఘం సభ్యులు భాగస్వాములు కావాలని కోరారు. సమాజ సేవా కార్యక్రమాల్లో సంఘం ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కాలేరు సుభాష్, పాన్డవీసం రాజేశ్వర్, సాల్వేరు రాజలింగం, కరిపే రాజు, బోదుకం నర్సయ్య, గంగోనే రమేష్, అశోక్, గణేష్, గంగోనే శ్రీనివాస్, బాదంగే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్‌లో 101 అడుగుల ఎత్తున మువ్వన్నెల రెపరెపలు






**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు బోధన్ పట్టణంలో చారిత్రాత్మక ఘట్టానికి వేదికయ్యాయి. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏకచక్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 101 అడుగుల అత్యంత ఎత్తైన జాతీయ జెండాను సోమవారం అత్యంత వైభవంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సమాజంలో ప్రాణదాతలుగా నిలిచే పట్టణ మహిళా వైద్యులు ఈ భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం విశేషం. పతాకావిష్కరణకు ముందుగా దేశ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో పరిసరాలన్నీ దేశభక్తితో మారుమోగాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పట్టణ ప్రజలను కట్టిపడేశాయి. తమ సేవలను గుర్తించి, ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములను చేసినందుకు మహిళా వైద్యులు ఏకచక్ర సేవా సమితికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వైద్యులను ఘనంగా సన్మానించారు. వేడుకల అనంతరం ప్రజలకు, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏకచక్ర సేవా సమితి అధ్యక్షులు అంకు మహేష్, కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా క్రీడా పోటీలు



**నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కమ్మర్ పల్లి మండలం బషీరాబాద్ కాంగ్రెస్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ పోటీలను ఏర్పాటు చేశారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు కాంగ్రెస్ నాయకులు నగదు బహుమతులతో పాటు మెమెంటోలను అందజేశారు. ప్రథమ విజేతగా నిలిచిన జట్టుకు రూ. 3 వేల నగదుతో పాటు ఆకర్షణీయమైన కప్పులు, మెమెంటోలను అందజేశారు. ద్వితీయ విజేత రన్నరప్?గా నిలిచిన బషీరాబాద్ జట్టుకు రూ. 2 వేల నగదు, కప్పు మెమెంటోలను బహుకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం నాడు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో ఐక్యత పెరుగుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ కాంగ్రెస్ సభ్యులు, క్రీడాకారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కులాల ఐక్యతతోనే సామాజికాభివృద్ధి: ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



**నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :**
నిజామాబాద్ కుల సంఘాలు ఐక్యతతో పాటు సేవా దృక్పథాన్ని అలవరుచుకున్నప్పుడే సామాజికాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పెరిక కుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్?ను ఆయన ఘనంగా ఆవిష్కరించారు. జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్షులు రాజన్న, జనరల్ సెక్రెటరీ అల్లే రమేష్?లతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో అయన మాట్లాడుతూ.. కుల సంఘాల బలోపేతానికి, పేదల సంక్షేమానికి సంఘాలు కృషి చేయాలన్నారు. పెరిక కుల సంఘం కార్యకలాపాలు, వారి సేవా కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ కౌలయ్య, చందు, అశోక్, ఆప్కార్ సాయిలు, సుదర్శన్మ పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న కుల పెద్దలు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# ప్రజాసేవలో ఖాకీల ముందడుగు.. నిజామాబాద్ జిల్లాలో 93 మందికి పురస్కారాలు

**- నేరాల అదుపు, ప్రజా రక్షణలో చూపిన అంకితభావానికి గుర్తింపు**



**నిజామాబాద్ జిల్లా జనవరి 26(డీడీ9 వార్త) :**
శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తూ, ప్రజల భద్రతే ధ్యేయంగా పనిచేస్తున్న నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ సిబ్బందికి సముచిత గౌరవం దక్కింది. 2026 గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన 93 మంది పోలీస్ అధికారులను, సిబ్బందిని ప్రశంసా పత్రాలకు కమిషనర్ ఎంపిక చేయడంతో సోమవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా 93 మందికి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. నేరాల ఛేదనలో చాకచక్యం ప్రదర్శించిన వారితో పాటు సామాజిక బాధ్యతతో పనిచేసిన హోంగార్డుల వరకు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలోనూ చట్ట వ్యతిరేక శక్తుల ఆటకట్టించడంలోనూ సిబ్బంది చూపిన చొరవను పత్రికా ప్రకటనలో కొనియాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన బాలలను చేరదీసే 'ఆపరేషన్ స్మైల్'లో ఎస్సై సింగ్ కరణ్ చేసిన కృషి అభినందనీయం. ఆర్మూర్ డివిజన్?లో షీ టీమ్స్ ద్వారా వేధింపులకు అడ్డుకట్ట వేసిన కానిస్టేబుల్ విఘ్నేష్ సేవలు మహిళా భద్రతపై భరోసా కల్పించాయి. మూర్ఛ వ్యాధితో రోడ్డుపై పడిపోయిన అభాగ్యుడిని ఆదుకుని ఆసుపత్రికి చేర్చిన హోంగార్డ్ గంగా మోహన్, పోలీసులంటే కేవలం శిక్షించే వారు మాత్రమే కాదు, రక్షించే వారని నిరూపించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల వంటి కీలక సమయాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించిన ఆర్మూర్ సీఐ పి.సత్యనారాయణ, బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్ బృందం ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా చూశారు. ఏటీఎం దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి కేసుల్లో నిందితులను వేగంగా పట్టుకుని బాధితులకు న్యాయం చేసిన కానిస్టేబుళ్లు, ఎస్సైలకు ఈ అవార్డులు దక్కాయి. కేవలం ఫీల్డ్ డ్యూటీ చేసే వారికే కాకుండా, ఆఫీస్ ఫైళ్లను పారదర్శకంగా పర్యవేక్షిస్తూ పాలనలో కీలకపాత్ర పోషించిన ఆఫీస్ సూపరింటెండెంట్ సి.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మురళి వంటి క్లరికల్ సిబ్బందికి కూడా గుర్తింపు లభించడం విశేషం. వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్న హెడ్ కానిస్టేబుల్ చంద్రమౌళికి కూడా ప్రశంసా పత్రం లభించడం ఆయన సుదీర్ఘ సేవలకు దక్కిన నిజమైన గౌరవంగా భావించవచ్చు.





# జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీకి ఎంపికైన భూతాయి

**- బాలుడు జాట్ మహేష్.**






**బజార్ హత్నూర్, జనవరి 26(డిడి9వార్త న్యూస్):-**
బజార్ హత్నూర్ మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల బజార్ హత్నూర్ లో చదువుతున్న భూతాయిగ్రామానికి చెందిన జాట్ మహేష్ అనే బాలుడు సాఫ్ట్ బాల్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగాప్రధానోపాధ్యాయులు జె భూమన్న మాట్లాడుతూ జనవరి 21 నుంచి 23 వరకు నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్ పల్లి లో జరిగిన అండర్ 17 పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా కు మూడవ స్థానం దక్కిందని, ఆ జట్టుకు నాయకత్వంవహించిన జాట్ మహేష్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. వచ్చే ఫిబ్రవరి నెల 4 వ తేది నుంచి 8వ తేదీ వరకు చత్తీస్ గడ్ రాష్టంలోని బిలాస్ పూర్ లో జరిగబోయే సాఫ్ట్ బాల్ పోటీలో మన పాఠశాలవిద్యార్థి ఎంపిక అయినందన హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు మహేష్ ను ఉపాధ్యాయ బృందం శాలువాతో సన్మానించి శుభాశిస్సులు అందించారు. ఈ కార్యక్రమంలోఅమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ యం నవనీత, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# బరంగ్ ఏడ్గి సర్పంచ్‌పై కేసు నమోదు

**బీర్కూర్,జనవరి 26(డిడి9 వార్త):**
బీర్కూర్ మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామ సర్పంచ్ రెంజర్ల అనీల్ కుమార్?పై కేసు నమోదు చేసినట్లు బీర్కూర్ ఎస్?ఐ మహేందర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బరంగ్ ఏడ్గి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మేత్రి నాగుగొండ గ్రామానికి సంబంధించిన కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి వీడియోను పోస్టు చేశారని తెలిపారు. దీనిపై అదే గ్రామానికి చెందిన అన్నం గంగాధర్ మరో సందేశం పెట్టడం జరిగిందన్నారు.ఈ అంశాన్ని ఆసరాగా చేసుకుని గ్రామ సర్పంచ్ రెంజర్ల అనీల్ కుమార్?తో పాటు అన్నం అనీల్, కోటగిరి గంగొండ, గైని సాయిలు, లక్కపల్లి హన్మాండ్లు కలిసి మేత్రి నాగుగొండ ఇంటిపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారని ఎస్?ఐ వెల్లడించారు.బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్?ఐ మహేందర్ హెచ్చరించారు.

# హైదరాబాద్?కు చెందిన డాక్టర్ ప్రద్యుత్ వాఘ్రేకు.. 'గవర్నర్స్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్-2025' పురస్కారం.



**హైదరాబాద్:** చెందిన ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రద్యుత్ వాఘ్రేకు ప్రతిష్టాత్మకమైన పురస్కారం లభించింది. గ్రామీణ వైద్య సేవలకు ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా 'గవర్నర్స్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్-2025' పురస్కారాన్ని అందుకున్నారు. మూడు దశాబ్దాల అనుభవం కలిగిన డాక్టర్ వాఘ్రే.. లండన్ రాయల్ కాలేజీ నుంచి ఫెలోషిప్ పొందిన రాష్ట్ర తొలి ఊపిరితిత్తుల నిపుణుడు. నిజాం వ్యక్తిగత వైద్యుల కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తూనే.. అసాధ్యమైన ఊపిరితిత్తుల వ్యాధులపై ఆయన చేస్తున్న పరిశోధనలు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాయి .హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రద్యుత్ వాఘ్రేకు సోమవారం ప్రతిష్టాత్మకమైన 'గవర్నర్స్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్-2025' పురస్కారం లభించింది. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు. గ్రామీణ ఆరోగ్యం, వైద్య రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు, దాతృత్వ కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. రాజ్ భవన్?లో అట్టహాసంగా జరిగిన ఈ వేడుకలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ప్రముఖులు పాల్గొన్నారు.మహిళా సాధికారత, గిరిజన అభివృద్ధి, గ్రామీణ వైద్య సేవలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత వంటి ముఖ్యమైన రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ 'గవర్నర్ అవార్డులను' అందజేశారు. మాజీ కేంద్ర హోం కార్యదర్శి కె. పద్మనాభయ్య నేతృత్వంలోని ఉన్నత స్థాయి ఎంపిక కమిటీ ఈ నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి.. అర్హులకే ఈ పురస్కారాలు దక్కేలా చూసింది.

వైద్య వారసత్వం.. సేవా దృక్పథం..మహబూబ్‌నగర్‌లోని ఎస్.వి.ఎస్ () మెడికల్ కాలేజీలో పల్మనరీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్, హెడ్?గా.. అలాగే జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్స్?లో సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్?గా సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రద్యుత్ వాఘ్రే వైద్య వృత్తి పట్ల అంకితభావానికి ఒక నిదర్శనంగా నిలుస్తారు. ఆయన కునాల్ ఇన్?స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్?కు మేనేజింగ్ డైరెక్టర్?గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డాక్టర్ వాఘ్రేది గొప్ప వైద్య వారసత్వం ఉన్న కుటుంబం. ఆయన తాత లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ కైలాష్?నాథ్ వాఘ్రే నిజాం నవాబుకు వ్యక్తిగత వైద్యుడిగా పనిచేశారు. అంతేకాకుండా.. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొట్టమొదటి మెడికల్ సర్వీసెస్ డైరెక్టరుగా.. గాంధీ మెడికల్ కాలేజీ అండ్ మెహదీ నవాజ్ జంగ్ క్యాన్సర్ ఆసుపత్రి స్థాపనలో కీలక పాత్ర పోషించారు. తన పూర్వీకుల అడుగుజాడల్లో నడుస్తూ.. డాక్టర్ వాఘ్రే ఆ సేవా దృక్పథాన్ని కొనసాగిస్తున్నారు.అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు..ఊపిరితిత్తుల వైద్య రంగంలో డాక్టర్ వాఘ్రే సాధించిన విజయాలు అసాధారణమైనవి. ఇప్పుడు అందుకున్న పురస్కారం మాత్రమే కాకుండా.. ఆయన ఖాతాలో మరెన్నో ప్రతిష్టాత్మక గౌరవాలు ఉన్నాయి. లండన్‌కు చెందిన ప్రఖ్యాత 'రాయల్ కాలేజీ ఆఫ్ ఫిజీషియన్స్' నుంచి ఫెలోషిప్ పొందిన తెలంగాణ తొలి పల్మనాలజిస్ట్?గా ఆయన రికార్డు సృష్టించారు. ప్రపంచవ్యాప్తంగా వైద్యులకు ఇది అత్యున్నత గౌరవంగా భావిస్తారు. గత మూడు దశాబ్దాలుగా రీసెర్చ్ అండ్ వైద్య వృత్తిలో ఆయన చేసిన అద్భుతమైన కృషిని గుర్తించి.. రాయల్ కాలేజీ కౌన్సిల్ తన తాజా సమావేశంలో ఆయన పేరును ఖరారు చేసింది. లండన్?లో జరిగిన ఒక ప్రత్యేక వేడుకలో ఆయన ఈ ఉన్నత స్థాయి వైద్యుల బృందంలో సభ్యునిగా చేరారు.అంతే కాకుండా.. భారత సాయుధ దళాలకు గౌరవ పల్మనాలజిస్ట్?గా సేవలు అందిస్తున్న డాక్టర్ వాఘ్రే, వైద్య రంగంలో అనేక అంతర్జాతీయ సభ్యత్వాలను కలిగి ఉన్నారు. అమెరికన్ కాలేజ్ ఆఫ్ చెస్ట్ ఫిజీషియన్స్ ఫెలోగా, లండన్ రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అసోసియేట్ మెంబర్?గా గుర్తింపు పొందారు. వీటితో పాటు బ్రిటీష్ థొరాసిక్ సొసైటీలో సభ్యత్వం , యూరోపియన్ రెస్పిరేటరీ సొసైటీలో ప్రతిష్టాత్మకమైన గోల్డ్ మెంబర్?షిప్?ను కూడా ఆయన దక్కించుకున్నారు. 2019లో కోల్?కతాలో జరిగిన 7వ ఈఈటీ-సీఆర్ఎస్ ఫ్యాకల్టీ బ్రాండింగ్ వేడుకలో ఆయనకు 'ఎక్సలెన్స్ ఇన్ రీసెర్చ్ అవార్డు' లభించింది.ఊపిరితిత్తుల వ్యాధులపై సరికొత్త పరిశోధనలు..

వైద్య రంగంలో వస్తున్న సరికొత్త మార్పుల్లో డాక్టర్ వాఘ్రే ముందు వరుసలో ఉన్నారు. ముఖ్యంగా.. నయం చేయడం సాధ్యం కాని 'ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్' అనే ఊపిరితిత్తుల వ్యాధికి సంబంధించి ఆయన అద్భుతమైన పరిశోధనలు చేస్తున్నారు. సాధారణ చికిత్సలతో పాటు స్టెమ్ సెల్ థెరపీ (కణ చికిత్స)ని కలిపి అందించే విధానంపై ఆయన కృషి చేస్తున్నారు. అమెరికాలోని మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ వైద్యులతో కలిసి ఆయన చేస్తున్న ఈ పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న రోగులలో కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయి పరిశోధన వ్యాసాలు, వైద్య పాఠ్యపుస్తకాల రచనలు, విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించడం ద్వారా ఆయన వైద్య శాస్త్ర పురోభివృద్ధికి నిరంతరం తోడ్పడుతున్నారు.డాక్టర్ వాఘ్రే అటు బోధనలో.. ఇటు వైద్య సేవల్లో, సామాజిక సేవా కార్యక్రమాల్లో చూపిస్తున్న చొరవ అభినందనీయం. ముఖ్యంగా తెలంగాణలోని వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో ఆయన అందిస్తున్న సేవలు ఎంతో ప్రభావం చూపుతున్నాయి. ఇప్పుడు దక్కిన ఈ గవర్నర్ పురస్కారం ఆయన వ్యక్తిగత విజయాలను గౌరవించడమే కాకుండా.. నగర , గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న వైద్య సేవల వ్యత్యాసాన్ని తగ్గించడంలో అంకితభావం కలిగిన వైద్యుల పాత్ర ఎంత కీలకమో చాటి చెబుతోంది.భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ (+శీజవతీఅశీతీ యఅంష్త్రఅబ ఎవజ ఝుతీఝు) అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్?లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగరవేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్?ను ఆవిష్కరించిందని.. ఈ డాక్యుమెంట్ హైదరాబాద్ ఇమేజ్?ను మరింత పెంచుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.ధాన్యం ఉత్పత్తిలో అగ్రస్థానం..మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయించినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్?లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు, ధాన్యానికి బోనస్?గా రైతులకు రూ.1,780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు.ఉద్యోగాల భర్తీ..భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన తెలిపారు. ఌ×లను అడ్వాన్స్? టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్?గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారుమహిళలకు ప్రాధాన్యం...

మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని, మహిళలను పెట్రోల్ బంక్?లు, ఆర్టీసీ అద్దె.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్?లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు.అంతకుముందు, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్?లో నిర్వహించిన 77వ రిపబ్లిక్ డే వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు.అమెరికా పర్యటనలో ఉండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్?కు హాజరుకాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ప్రజలకు

# నీల్-ఎన్టీఆర్ కాంబినేషన్ డ్రాగన్ తుదిదశకు షూటింగ్ జూన్ 25న విడుదల చేసేలా ప్లాన్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్-ఇండియన్ సినిమా పై తాజాగా క్రేజీ అప్‌డేట్ బయటికి వచ్చింది. వర్కింగ్ టైటిల్: డ్రాగన్ పేరుతో ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో దూసుకుపోతోంది. తాజాగా ఈ సినిమా ప్రస్తుత షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో విజయవంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో ఎక్కువగా నైట్ ఎఫెక్ట్‌తో నైట్ షూటింగ్ నిర్వహించారని టాక్. తదుపరి షెడ్యూల్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు సమాచారం. ప్రశాంత్ నీల్ అంటేనే భారీ యాక్షన్, డార్క్ టోన్, పవర్‌ఫుల్ ఎలివేషన్లు గుర్తుకు వస్తాయి. అదే ఫార్ములాను ఈసారి ఎన్టీఆర్ స్థాయికి మించి చూపించేందుకు దర్శకుడు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా ప్యూర్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో యాక్షన్ సీక్వెన్సులు అత్యంత ఇంటెన్స్‌గా ఉండబోతున్నాయట. ఎన్టీఆర్ కెరీర్‌లోనే బెస్ట్ యాక్షన్ రోల్స్‌లో ఇది ఒకటిగా నిలుస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటి వరకు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన అన్ని సినిమాల్లోకెల్లా ఇదే బెస్ట్ మూవీ అవుతుందన్న అంచనాలు బలంగా ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్‌లో టాప్ ప్రొడక్షన్ హౌసెస్‌గా గుర్తింపు పొందిన మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్నాయి. భారీ బ్జడెట్‌తో, పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. రవి బస్రూర్ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఇందులో కథానాయికగా రుక్మిణి వసంత్, కీలక పాత్రలో అనిల్ కపూర్ కనిపించనున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని భాషల్లో ప్రేక్షకులను ఆకట్టుకునేలా పాన్-ఇండియన్ ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది. జూన్ 25 సినిమాని విడుదల చేసే ప్లాన్ చేస్తున్నారు.

--------

# ఇరుముడితో రవితేజ కొత్త మూవీ

మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రేక్షకుల్లో ఆ సినిమాలు పూర్తి సంతృప్తిని కలిగించలేకపోయాయి. మాస్ ఇమేజ్‌కు కాస్త విరామం ఇచ్చి, క్లాస్ టచ్‌తో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో రవితేజ తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఆయన దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. అయ్యప్ప స్వామి మాలధారణలో రవితేజ కనిపించిన లుక్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. పోస్టర్ చూసిన వెంటనే ఒక డివోషనల్ ఫీల్, పాజిటివ్ వైబ్స్ కలుగుతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయ్యప్ప మాలధారణలో ఇరుముడికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సినిమాలో ఎమోషనల్‌గా, డీప్‌గా చూపించబోతున్నారని సమాచారం. సెన్సిటివ్, క్లాస్ కథనాలతో పేరు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈసారి డివోషనల్ టచ్‌తో కథను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మాస్‌కు భిన్నంగా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా రవితేజ కొత్త ఇమేజ్‌ను ఆవిష్కరించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి జీ.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 'ఇరుముడి' రవితేజ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్నది అభిమానుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది.






# సెలెక్టెడ్‌గానే ఐటమ్ సాంగ్స్ చేస్తా : రష్మిక

ఒకప్పుడు సినిమాల్లో ఐటం పాట అంటే ప్రత్యేకంగా ప్రొఫెషనల్ డాన్సర్లే గుర్తొచ్చేవారు. ఆ పాటల్లో వాళ్లు కనిపిస్తేనే హిట్ అనే స్టాండర్డ్ ఉండేది. కానీ కాలం మారింది. ఇప్పుడు అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నటీమణులే ఐటం సాంగ్స్‌లోనూ స్టెప్పులేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఒకే సినిమాలో హీరోయిన్ పారితోషికంతో పాటు స్పెషల్ సాంగ్ ఫీజు కూడా అందుకుంటూ డబుల్ లాభం పొందుతున్నారు. ఈ ట్రెండ్‌కు అనుగుణంగానే గత కొన్నేళ్లుగా సమంత, కాజల్ అగర్వాల్, తమన్నా, పూజా హెగ్డే, శ్రీలీల వంటి స్టార్ హీరోయిన్లు ఐటం పాటల్లో కనిపించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఇదే ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద సినిమాల్లో ఐటం సాంగ్ అంటే స్టార్ హీరోయిన్ ఉండాల్సిందే అనే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే 'నేషనల్ క్రష్'గా గుర్తింపు పొందిన రష్మిక మందన్నా కూడా ఈ దారిలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ డెబ్యూ 'గుడ్‌బై'లో నటిగా మెప్పించిన ఆమె, తర్వాత వచ్చిన 'థామా' చిత్రంలో నటనతో పాటు స్పెషల్ సాంగ్‌లోనూ తనదైన స్టైల్‌లో ఆకట్టుకుంది. ఆ పాట తర్వాత రష్మికపై ఐటం భామగా కూడా డిమాండ్ పెరిగింది. దర్శక, నిర్మాతలు 'హీరోయిన్‌గా తీసుకున్నా, ఐటం సాంగ్‌కు కూడా ఒప్పించొచ్చు' అనే ధీమాతో ఆమె వైపు చూస్తున్నారనే టాక్ వినిపించింది. కానీ ఇదే సమయంలో రష్మిక ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాను నటిగా అయినా, ఐటం భామగా అయినా కేవలం ఇద్దరు దర్శకుల సినిమాల్లో మాత్రమే స్పెషల్ సాంగ్స్ చేస్తానని, అంతకుమించి ఈ విషయంలో చాలా సెలెక్టివ్‌గా ఉంటానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రష్మికపై భారీ ఆశలు పెట్టుకున్న కొంతమంది దర్శకులు ఈ షరతులతో కాస్త నిరాశకు గురైనట్లు సమాచారం.

# 30న వస్తున్న విజయ్ సేతుపతి గాంధీ టాక్స్

?

టాకీ యుగం ప్రారంభమైన తర్వాత వచ్చిన అతి తక్కువ ప్రయోగాత్మక చిత్రాల్లో 'పుష్పక విమానం' ఒకటి. ఆ కోవలో మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మూవీ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది 'గాంధీ టాక్స్'. విజయ్ సేతుపతి, అదితీరావ్ హైదరీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. కిశోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు అందుకుందీ సినిమా. ఈ నెల 30న థియేటర్లలో విడుదల కానుంది. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.




# మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ నివాసాలకు స్వయంగా వెళ్లి సన్మానించిన చిరంజీవి





ప్రముఖ సినీ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లు పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల్లో ఒకే ఏడాది ఇద్దరు తెలుగు సినీ నటులకు పద్మశ్రీలు రావడం పట్ల సర్వత్ర సంతోషం వ్యక్తమవుతోంది. ఈ గౌరవం తెలుగు సినీ పరిశ్రమకు, సాంస్కృతిక రంగానికి గర్వకారణంగా నిలిచింది. ఈ ఆనందాన్ని మెగాస్టార్ చిరంజీవి మరింత ప్రత్యేకంగా మార్చారు. ఆయన స్వయంగా మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్ నివాసాలకు వెళ్లి వారిని శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. దశాబ్దాల పాటు కలిసి ప్రయాణించిన అనుబంధం, పరస్పర గౌరవం ఈ సందర్భంలో ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ... ఇది నిజంగా ఒక ఆనందకరమైన రోజు అని అన్నారు. "పద్మ పురస్కారాలకు ఎంపికైన వారందరికీ హృదయపూర్వక అభినందనలు... ఇది మన తెలుగు సినిమాకు గర్వకారణం" అని ఆయన పోస్ట్ చేశారు.



# ఒక వ్యక్తితో డేటింగ్ లో ఉన్నా: హీరోయిన్ ఈషా రెబ్బా

టాలీవుడ్ హీరోయిన్ ఈషా రెబ్బా, దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ మధ్య ప్రేమ, పెళ్లి రూమర్స్ గత కొన్ని నెలలుగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. వీరిద్దరు డేటింగ్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని సోషల్ మీడియాలో, మీడియా వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గత దీపావళి పండుగా సందర్భంగా వీరు ఫ్రెండ్స్‌తో కలిసి సెలబ్రేట్ చేసుకున్న ఫొటోలు వైరల్ కావడంతో ఈ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో, ఈషా తనపై వస్తున్న వార్తలపై స్పందించింది.

ఈషా హీరోయిన్‌గా, తరుణ్ భాస్కర్ హీరోగా నటించిన కొత్త చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' ఈ నెల 30న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ మూవీ ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రమోషన్స్ సందర్భంగా ఈషా మాట్లాడుతూ, ఈ రూమర్స్ పై స్పందించింది. "జరుగుతున్న ప్రచారం నిజం కాదు" అని ఆమె స్పష్టం చేసింది. తన తండ్రి కూడా ఈ వార్తలు చూసి "పెళ్లెప్పుడు?" అని అడిగారని చెప్పింది. అయితే, తాను ఒక వ్యక్తితో డేటింగ్ లో ఉన్నానని తెలిపింది. కానీ, అది ఇంకా ప్రారంభ దశలోనే ఉందని చెప్పింది. అయితే, ఆ వ్యక్తి తరుణ్ భాస్కరా? కాదా? అన్నది మాత్రం స్పష్టం చేయలేదు.

# బాలీవుడ్ తన ఆత్మను కోల్పోయింది

## : ప్రకాశ్ రాజ్ సంచలన వ్యాఖ్యలు



దక్షిణాది నుంచి ఉత్తరాది వరకు అన్ని భాషల్లో విభిన్నమైన పాత్రలతో తనదైన ముద్ర వేసుకున్న నటుడు ప్రకాశ్ రాజ్. కేవలం నటుడిగానే కాకుండా, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై తన అభిప్రాయాలను నిస్సంకోచంగా వెల్లడించే వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. తాజాగా హిందీ చిత్ర పరిశ్రమపై (బాలీవుడ్) ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి.
కేరళలోని కోజికోడ్‌లో నిర్వహించిన కేరళ లిటరేచర్ ఫెస్టివల్లో పాల్గొన్న ప్రకాశ్ రాజ్... బాలీవుడ్ ప్రస్తుతం తన అసలైన మూలాలను కోల్పోయిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పైకి చూడటానికి హిందీ సినిమాలు చాలా రంగులమయంగా, భారీ సెట్లు, గ్లామర్‌తో కనిపిస్తున్నాయని, కానీ లోపల మాత్రం వాటికి ఆత్మ లేదని ఆయన అభిప్రాయపడ్డారు. బాలీవుడ్ సినిమాలను ఆయన మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలోని ప్లాస్టిక్ విగ్రహాలతో పోల్చడం విశేషం. చూడటానికి ఆకర్షణీయంగా ఉన్నా, వాటిలో జీవం ఉండదని చెప్పారు. మల్టీప్లెక్స్ సంస్కృతి పెరిగిన తర్వాత హిందీ సినిమా పరిశ్రమ కథలు, భావోద్వేగాలను పక్కన పెట్టి కేవలం లగ్జరీ లుక్స్, భారీ బడ్జెట్లు, మార్కెటింగ్, డబ్బు చుట్టూనే తిరుగుతోందని ఆయన విమర్శించారు. అదే సమయంలో దక్షిణాది సినిమా పరిశ్రమను ప్రకాశ్ రాజ్ ప్రశంసలతో ముంచెత్తారు. ముఖ్యంగా తమిళ, మలయాళ సినిమాలు మట్టి వాసన కలిగిన కథలను, సామాన్యుల జీవితాలను, అట్టడుగు వర్గాల సమస్యలను ఎంతో సహజంగా తెరపై చూపిస్తున్నాయని కొనియాడారు. దళితుల వేదన, సామాజిక అసమానతలు వంటి అంశాలను నిజాయతీగా చెప్పే ప్రయత్నం అక్కడి దర్శకులు చేస్తున్నారని చెప్పారు.